క్లుప్తంగా

అభిమాన నేతను కలసిన హస్వంత్



ఘంటసాల: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన హశ్వంత్ అమెరికాలో ఇంజినీరింగ్ విద్యనభ్యసిస్తున్నాడు. హశ్వంత్‌కు ఎప్పటినుంచో తన అభిమాన నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలవాలని ఆశ. తల్లిదండ్రులను ఒప్పించి విజయవాడ చేరుకున్న హశ్వంత్ గురువారం గుంటూరు జిల్లా తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జగనన్నను కలసి తన అభిమానాన్ని చాటుకున్నాడు. కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదిగి సమాజానికి సేవలందించాలని జగనన్న సూచించినట్లు హశ్వంత్ తెలిపాడు.

ప్రత్యేక తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోండి

చిలకలపూడి(మచిలీపట్నం): సంక్రాంతి పండుగ సెలవుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న పాఠశాలలు, కళాశాలలపై చర్యలు తీసుకుని వాటి గుర్తింపును రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఈ.ప్రేమ్‌కుమార్ కోరారు. ఈ మేరకు శుక్రవారం డీఈవో పీవీజే రామారావుకు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఎస్.సమరం, ప్రదీప్, జయకర్ ఉన్నారు.

వీఆర్వో, వీఆర్ఏ సంఘ క్యాలెండర్ ఆవిష్కరణ

చిలకలపూడి(మచిలీపట్నం): ఆంధ్రప్రదేశ్ వీఆర్వో, వీఆర్ఏ సంఘాలకు చెందిన క్యాలెండర్‌ను శుక్రవారం కలెక్టర్ డీకే బాలాజీ కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వీరాంజనేయప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఎంవీ శ్యామ్‌నాథ్, వీఆర్ఏల సంఘ నాయకుడు గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

మచిలీపట్నంటౌన్: సుదీర్ఘ కాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఉద్యోగులు శుక్రవారం స్థానిక ఎల్ఐసీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎల్ఐసీ సీనియర్ డివిజినల్ మేనేజర్ జి.సుధాకరబాబుకు అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డు ఉద్యోగుల సంఘ డివిజన్ అధ్యక్షుడు పి.కృష్ణ, ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఐసీఈయూ మచిలీపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి జి.కిషోర్‌కుమార్ ధర్నాకు మద్దతు తెలిపారు.

మండల పరిషత్‌లో లైఫ్ సర్టిఫికెట్ శిబిరం

గూడూరు: గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం లైఫ్ సర్టిఫికెట్ శిబిరం నిర్వహించారు. మచిలీపట్నం ఖజానా శాఖ కార్యాలయ సీనియర్ అకౌంటెంట్‌లు ఎం.శ్రావణ్‌కుమార్, వెంకటేశ్వరమ్మ జీవన్ ప్రమాణ్ యాప్‌లో ఫేషియల్ అథెంటికేషన్ ద్వారా పెన్షనర్ల లైఫ్ సర్టిఫికెట్ తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి నెలాఖరులోగా పెన్షనర్లు తప్పనిసరిగా తమ లైఫ్ సర్టిఫికెట్‌లు సమర్పించాలని ప్రభుత్వం గడువు విధించిందని వెల్లడించారు.

ముక్తిదాయకం.. ముక్కోటి దర్శనం

- వైష్ణవాలయాల్లో ఉత్తర ద్వార దర్శనాలకు పోటెత్తిన భక్తులు
- గరుడవాహనంపై ఊరేగిన దేవేరులు



ఉల్లిపాలెంలో ఉత్తరద్వారంలో దర్శనమిచ్చిన శ్రీమన్నారాయణుడు



శ్రీకాకుళం పురవీధుల్లో గరుడవాహనంపై ఊరేగుతున్న శ్రీకాకుళేశ్వర స్వామి, అమ్మవార్లు

కోడూరు: శ్రీమహావిష్ణువు గరుడ వాహనదారుడై మూడు కోట్ల దేవతలతో భూలోకానికి దిగివచ్చి భక్తులకు దర్శనమిచ్చిన ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అభినవ మేల్కోటగా పేరుగాంచిన ఉల్లిపాలెంలోని శ్రీగోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణస్వామివారి ఆలయంలో శుక్రవారం వేకువజామున 4 గంటలకు ఉత్తర ద్వారం తెరిచి స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అష్టాక్షరీ పీఠాధిపతి త్రిదండి అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజ జీయర్ స్వామిజీ స్వామి వార్లకు తొలిపూజలు చేశారు. అనంతరం భక్తులకు ఉత్తర ద్వారం ద్వారా స్వామివారి దర్శనాన్ని కల్పించారు. గర్భాలయంలోని 11 అడుగుల ఏకశిలా శ్రీమన్నారాయణుడి విగ్రహానికి వజ్రవైడూర్యాలతో పొదిగిన ఆభరణాలతో ప్రత్యేక అలంకారం చేశారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కుటుంబ సమేతంగా ఉత్తరద్వారం ద్వారా శ్రీమన్నారాయణుడిని దర్శించుకున్నారు. బుద్ధప్రసాద్, మండలి వెంకట్రామ్ (రాజా) దంపతులను అష్టాక్షరీ స్వామిజీ సత్కరించారు.

- కోడూరులో అష్టలక్ష్ముల మధ్య వెంకటేశ్వరుడు..

కోడూరులోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామివారి ఆలయంలో ఉదయం 4 గంటల నుంచి ఉత్తరద్వారం తెరిచి భక్తులను దర్శనానికి అనుమతించారు. గర్భాలయంలోని వెంకటేశ్వరుడిని చుట్టూ ఏర్పాటుచేసిన అష్టలక్ష్ముల అలంకారం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఆలయంలో ముక్కోటి విశిష్టతను వివరిస్తూ రంగవల్లిని తీర్చిదిద్దారు. కరెన్సీ నోట్లతో శ్రీనివాసుడి చిత్రపటం చుట్టూ చేసిన అలంకరించారు. హంసలదీవి రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, నరసింహపురంలోని రామాలయాల వద్ద కూడా భక్తులకు ముక్కోటి దర్శనం కల్పించారు.

పెడనలో...

పెడన: పట్టణంలోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో జరిపారు. ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. పలువురు పట్టణ ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు.



పెదకళ్లేపల్లిలో విశేష అలంకరణలో మదన గోపాలస్వామివారు

నాగాయలంకలో...

నాగాయలంక: నాగాయలంకలోని ప్రాచీన శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో రుక్మిణీ, శ్రీసత్యభామ సమేత శ్రీవేణుగోపాలుడు ప్రత్యేక అలంకారంతో భక్తులకు ఉత్తర ద్వార దర్శనం ఇచ్చారు. మండలంలోని భావదేవరపల్లిలో చారిత్రాత్మకమైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీరాజ్యలక్ష్మి సమన్విత శ్రీభావన్నారాయణ స్వామి దేవస్థానంలో, కృష్ణానదీతీరంలోని శ్రీరామపాద క్షేత్రంలో భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు.

శ్రీకాకుళంలో...

శ్రీకాకుళం(ఘంటసాల): ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామంలో ఉన్న శ్రీకాకుళేశ్వర స్వామి వారి దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం ఉత్తర ద్వార దర్శనం వైభవంగా జరిగింది. ఆయా కార్యక్రమాల్లో దేవస్థానం అనువంశిక ధర్మకర్తలు చల్లపల్లి రాజ వంశీయులు యార్లగడ్డ శివరామ ప్రసాద్ కుటుంబ సభ్యులతో పాటు ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, యువనేత వెంకట్రామ్ దంపతులు, టీడీపీ మండల అధ్యక్షుడు తుమ్మల చౌదరి బాబు, మాజీ జెడ్పీటీసీ తుమ్మల వరలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. ప్రత్యేకంగా అలంకరించిన గరుడ వాహనంపై శ్రీ స్వామి వారు, అమ్మ వార్ల గ్రామోత్సవంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. శ్రీకాకుళం పురవీధులు గోవింద నామ స్మరణతో మార్మోగాయి. భక్తులకు సత్యసాయి సేవా సమితి వలంటీర్లు, దేవస్థానం సిబ్బంది, స్థానికులు సేవలను అందించారు. గ్రామానికి చెందిన కొండవీటి రత్నకుమారి జ్ఞాపకార్థం భర్త కృష్ణమూర్తి, జనసేన మండల ప్రధాన కార్యదర్శి కొండవీటి శ్రీనివాసరావు సహకారంతో మజ్జిగ పంపిణీ చేశారు. గ్రామస్తుల సహకారంతో అన్నసమారాధన ఏర్పాటుచేశారు.

ఆకట్టుకున్న మురళీ కోలాటం

శ్రీకాకుళం(ఘంటసాల): శ్రీకాకుళేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఉత్తర ద్వార దర్శనం సందర్భంగా శ్రీ అంకమ్మతల్లి మహిళా భక్తబృందం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రదర్శించిన మురళీ కోలాటం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. బాపట్ల జిల్లా రేపల్లె శివారు కోనేటిపురానికి చెందిన శ్రీ అంకమ్మ తల్లి మహిళా భక్త బృందం గురువు తుంగల సాయిబాబును ఆలయాధికారి చెన్నకేశవరావు శేషవస్త్రంతో సత్కరించారు.

రూ.23 వేల ఆర్థికసాయం

వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీకాకుళేశ్వరస్వామి వార్లు, అమ్మ వార్లతో పాటు ఆలయంలో పుష్పాలంకరణ నిమిత్తం హైదరాబాద్‌కు చెందిన ఎన్నారై డొక్కు వెంకట సాంబశివచలం, డొక్కు వెంకట సత్యరఘు రామాంజనేయ సహకారంతో వారి తల్లిదండ్రులు లక్ష్మీ నారాయణ దంపతులు రూ.23 వేల ఆర్థిక సాయాన్ని ఆలయ ఈవో దాసరి శ్రీరామ వర ప్రసాదరావుకు అందించారు.

కృత్తివెన్నులో...

కృత్తివెన్ను:ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని వైష్ణవాలయాలలో స్వామివారిని భక్తులు ఉత్తరద్వారం గుండా దర్శనం చేసుకున్నారు. లక్ష్మీపురంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఉదయం 5 గంటలకు సువాసిని, గోపూజల అనంతరం స్వామివారి దర్శనం జరిగింది. వెంకటేశ్వరస్వామి ఆలయాలతో పాటు అన్ని రామాలయాలందు ఉదయం నుంచి రామనామకీర్తనలతో భజనలు, విశేష పూజలు జరిగాయి.

పెదకళ్లేపల్లిలో...

పెదకళ్లేపల్లి(మోపిదేవి): మండలంలో పలు దేవాలయాల్లో వైకుంఠ ఏకాదశి వేడుకలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. మండల పరిధిలోని పెదకళ్లేపల్లిలో శ్రీమదన వేణుగోపాలస్వామివారి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం వేదపండితుల మంత్రోచ్ఛరణలతో ఘనంగా జరిగింది. పెద్ద ఎత్తున భక్తులు ఉత్తర ద్వార దర్శనం ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం స్వామివార్లను ప్రత్యేక వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు.

గూడూరులో...

గూడూరు: వైకుంఠ ఏకాదశి సందర్భంగా మండల కేంద్రమైన గూడూరులోని శ్రీ మాధవస్వామి ఆలయం, నరసింహస్వామి ఆలయం, సీతారామ స్వామి ఆలయాలలో స్వామి వారు ఉత్తర ద్వార దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని గరుడవాహనంపై పురవీధులలో ఊరేగించారు.

అవనిగడ్డలో...

అవనిగడ్డ: వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం స్థానిక లక్ష్మీ నారాయణస్వామి ఆలయం, గీతామందిరం, పులిగడ్డ, వేకనూరు వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. స్వామివారిని ప్రత్యేక గరుడ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఎంపీపీ తుంగల సుమతీదేవి, మాజీ ఎంపీపీ బండే కనకదుర్గ స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

కిటకిటలాడిన వైష్ణవాలయాలు



భక్తులకు దర్శనమిచ్చిన శ్రీ రుక్మిణీ సమేత శ్రీ పాండురంగస్వామి

మచిలీపట్నంటౌన్: ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం నగరంలోని పలు వైష్ణవాలయాల్లో స్వామివార్లు ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారు జాము నుంచే భక్తులు ఆలయాలకు విచ్చేసి స్వామి వార్లను దర్శించుకోవటంతో ఆయా ఆలయాలు కిటకిటలాడాయి. చిలకలపూడి శ్రీ రుక్మిణీ సమేత శ్రీ పాండురంగస్వామి ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. బచ్చుపేట, గొడుగుపేటల్లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాలు, రుస్తుంబాదలోని శ్రీ భద్రాద్రి రామాలయం, రాబర్ట్సన్‌పేటలోని శ్రీ రంగనాయకుని స్వామి ఆలయం, చల్లరాస్తా సెంటర్‌లోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం, నిజాంపేటలోని శ్రీ బొబ్బిలి వేణుగోపాల స్వామి గుడి, బలరామునిపేటలోని యతిరాజ భవనంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి, పరాసుపేటలోని శ్రీ సువర్చలా సమేత ఆంజనేయస్వామి వారి దేవాలయం ఆలయాల్లో స్వామివార్లను భక్తులు ఉత్తర ద్వారం ద్వారా దర్శించుకున్నారు.

బంటుమిల్లిలో...

బంటుమిల్లి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామి వార్లకు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక శ్రీ పద్మావతి, గోదా సమేత వేంకటేశ్వరస్వామి, శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయాల్లో తెల్లవారుజాము నుంచే ఉత్సవ మూర్తులను ఉత్తరాభిముఖంగా ఉంచి సుందరంగా అలంకరించి పూజలు చేశారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు తిరుప్పావై, విష్ణుసహస్ర నామ పారాయణ చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులను ట్రాక్టర్లపై ఉంచి మేళతాళాలతో గ్రామోత్సవాలు నిర్వహించారు. మండలంలోని అర్తమూరు, చోరంపూడి, ముంజులూరు, మల్లేశ్వరం తదితర గ్రామాల్లోని రామాలయాల్లో స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తెలుగు సంస్కృతిని చాటిన సంక్రాంతి వేడుకలు

నాగాయలంక: స్థానిక మారుతీ విద్యానికేతన్ డిజిటల్ స్కూలు ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించిన ముందస్తు సంక్రాంతి వేడుకలు తెలుగు సంస్కృతిని చాటాయి. బాలలకు టీచర్లు, తల్లిదండ్రులు భోగిపళ్లు పోసి ఆశీర్వదించారు. హరిదాసు, గోదాదేవి వేషధారణలతో చిన్నారులు అలరించారు. బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. రంగవల్లులను గొబ్బెమ్మలతో తీర్చిదిద్దారు. మహిళా టీచర్లు కొత్త ధాన్యాన్ని రోటిలో దంచి పొంగళ్లు వండి ప్రసాద వితరణ చేశారు.

అవనిగడ్డ: స్థానిక ఎస్‌వీఎల్ క్రాంతి విద్యాసంస్థలో సంక్రాంతి సంబరాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులతో సందడి చేశారు. భోగి మంటలు వేశారు. సంస్థ కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు, యువనేత మండలి వెంకట్రామ్, ఎంపీపీ తుంగల సుమతీదేవి ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్లబండిపై సెంటర్ నుంచి కళాశాల వరకు ఊరేగింపుగా వచ్చారు. పొట్టేళ్లు, కోళ్లతో పందేలు వేయించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్‌పర్సన్ వసుమతి, ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, పర్చూరి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పెడన: పట్టణంలోని విశ్వభారతి హైస్కూల్‌లో చిన్నారులకు వారి తల్లులు, ఉపాధ్యాయినులు భోగి పండ్లు పోశారు. అనంతరం హైస్కూల్ విద్యార్థినులకు రంగవల్లుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. బలిపర్రు ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కూడూరు ప్రాథమిక పాఠశాలలో భోగి మంట వేశారు. చిన్నారులు రంగవల్లుల పోటీల్లో పాల్గొన్నారు. పల్లోటిలో సెయింట్ విన్సెంట్ ఇంగ్లిష్ మీడియం హైస్కూలులో విద్యార్థులు హరిదాసు వేషధారణలతో ఆకట్టుకున్నారు. రంగవల్లులు పోటీలు నిర్వహించారు. గాలి పటాలను ఎగురవేశారు.

సంక్షిప్తంగా...

- **విద్యుదాఘాతంతో చేపల చెరువు కాపలాదారుడు మృతి**

కోనేరుసెంటర్: విద్యుదాఘాతానికి గురై చేపల చెరువు కాపలాదారుడు మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం రాత్రి బందరు మండలం పెదపట్నం గ్రామంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. బందరు మండలం పెదపట్నంలో సత్యనారాయణ అనే రైతుకు చెందిన చేపల చెరువుపై ఒడిశా రాష్ట్రం పోరాపుట్ గ్రామానికి చెందిన సుఖ్‌దేవ్ ధురువా (25) అనే యువకుడు నాలుగు నెలలుగా కాపలాదారుడిగా ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం చెరువులో నీళ్లు తోడేందుకు మోటర్ స్విచ్ వేస్తుండగా ప్రమాదవశాత్తు ధురువా విద్యుదాఘాతానికి గురై పడిపోయాడు. సమీప చెరువులపై కాపలా ఉండే కొంతమంది ధృవను ఆటోలో ఎక్కించుకుని చికిత్స నిమిత్తం మచిలీపట్నం సర్వజన ఆసుపత్రికి తరలించారు. మార్గమధ్యంలో ధురువా మృతి చెందాడు. జరిగిన సంఘటనపై బందరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

- **డోకిపర్రు బస్సు సర్వీసు శారదాయిపేటకు పొడిగింపు**



గూడూరు: విజయవాడ నుంచి డోకిపర్రు వరకు నడుస్తున్న ఆర్టీసీ బస్సు సర్వీసును గూడూరు మండలం శారదాయిపేట వరకు పొడిగించారు. ముక్కొల్లు గ్రామస్తుల అభ్యర్థన మేరకు ఈ బస్సును ముక్కొల్లు, గురిజేపల్లి, కంకటావ గ్రామాల మీదుగా శారదాయిపేట (నారికేడాలపాలెం) సెంటరు వరకు పొడిగించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం గ్రామానికి వచ్చిన బస్సుకు ముక్కొల్లు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. ప్రతి రోజూ తెల్లవారుజామున 4.25 గంటలకు శారదాయిపేట సెంటరు నుంచి బయలు దేరి ముక్కొల్లు, డోకిపర్రు, పామర్రు మీదుగా విజయవాడ కాళేశ్వరరావు మార్కెట్ వరకు రెండు ట్రిప్పులు నడుస్తుంది.

- **మహంకాళమ్మకు బంగారు బొట్టు బహూకరణ**

గూడూరు: మండలంలోని ముక్కొల్లు గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీ మహంకాళమ్మ అమ్మవారికి భక్తులు బంగారు బొట్టు, ముక్కు బ్రాసర బహూకరించారు. ప్రస్తుతం దేశ రాజధాని ఢిల్లీలో నివాసం ఉంటున్న గ్రామానికి చెందిన రామిశెట్టి శకుంతల కుమారులు వాటిని సమకూర్చినట్లు ఆలయ ఈఓ టి.వి.వి.మోహనరావు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.75 వేలు ఉంటుందని ఆయన వెల్లడించారు.

- **కోడిపందేలు, బెట్టింగుల నిరోధానికి కమిటీలు**

నాగాయలంక: సంక్రాంతి పర్వదినాలు పురస్కరించుకుని మండలంలో కోడిపందేలు, బెట్టింగుల వంటి సాంఘిక దురాచారాలను ఎట్టి పరిస్థితి లోనూ ఉపేక్షించబోమని తహసీల్దార్ ముప్పిరిశెట్టి హరనాథ్ హెచ్చరించారు. వీటిని నియంత్రించేందుకు మండల, గ్రామ స్థాయిలో కమిటీలు నియమించినట్లు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం అధికారులు, వీఆర్వోలు, కార్యదర్శులతో ఆయన మండల స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు.

- **పట్టుదలతో ప్రయత్నిస్తే విజయం**

కోనేరుసెంటర్: పట్టుదలతో ప్రయత్నిస్తే ఫలితం దానంతటదే చేరువ అవుతుందని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు అన్నారు. జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం పదో రోజు పోలీస్ సెలక్షన్స్‌ను ఎస్పీ స్వయంగా పరిశీలించారు. అభ్యర్థులతో మాట్లాడి తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. శుక్రవారం జరిగిన సెలక్షన్స్‌కు 350 మంది అభ్యర్థులకు గాను 236 మంది మెయిన్స్‌కు అర్హత సాధించినట్లు తెలిపారు.

- **ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వినతి**

మచిలీపట్నంటౌన్: సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఆ పార్టీ నియోజకవర్గ కమిటీ నాయకులు శుక్రవారం అర్హులైన ప్రతి పేదవానికి నగరంలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, గృహ నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని 46, 50 డివిజన్‌ల సచివాలయ ఇన్‌చార్జ్‌లకు వినతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కమిటీ మెంబర్ మోదుమూడి రామారావు, నియోజకవర్గ కార్యదర్శి లింగం ఫిలిప్, మహిళా సమాఖ్య నాయకురాలు ఒడుగు రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

- **బీజేపీ నాయకులపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలి**

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నంలో ఇటీవల బీజేపీ సమావేశంలో దళిత కార్యకర్తలను అవమానిస్తూ కులం పేరుతో దూషించిన బీజేపీ నాయకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) కృష్ణా జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రాజేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

- **గోకులం షెడ్డు ప్రారంభం**

పాపవినాశనం(ఘంటసాల): మండలంలోని పాపవినాశనం గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన గోకులం షెడ్డును శుక్రవారం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కుంపటి అనిత, యువనేత మండలి వెంకట్రామ్, టీడీపీ మండల అధ్యక్షుడు తుమ్మల చౌదరిబాబు, శ్రీకాకుళం డీసీ చైర్మన్ అయినపూడి భాను ప్రకాష్, ఎంపీటీసీ తాడికొండ చిన్నా, ఎంపీడీవో డి.సుబ్బారావు, మాజీ సర్పంచ్ మునిపల్లి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

- **విద్యుత్ సరఫరా నిలిపివేత**

గూడూరు: తరకటూరు సబ్ స్టేషన్ నిర్వహణ కారణంగా శనివారం గూడూరు మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మచిలీపట్నం ఆపరేషన్స్ ఈఈ జి.గోవిందరావు తెలిపారు. మండలంలోని గూడూరు, చిట్టిగూడూరు, తుమ్మలపాలెం, ఆకుమర్రు, రామరాజుపాలెం, కోకనారాయణపాలెం, ముక్కొల్లు, తరకటూరు, పినగూడూరులంక, పర్ణశాల, కలపటం, కంచాకోడూరు, మద్దిపట్ల గ్రామాల్లో ఉదయం 7.30 నుంచి 9.30 గంటల వరకు సరఫరా ఉండదని ఆయన వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

- **రైతుల భూసమస్యలకు పరిష్కార వేదిక**

కృత్తివెన్ను: రైతుల భూములకు సంబంధించి ఆన్‌లైన్‌లో పేర్లు నమోదులో తేడాలు, భూవిస్తీర్ణం, సర్వే నంబర్ల మార్పు తదితర సమస్యలను అర్జీ రూపంలో రెవెన్యూ సదస్సులో సమర్పించి సరిచేసుకోవచ్చని తహసీల్దార్ సోమేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని చెరుకుమిల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ముందుగా ర్యాలీ జరిపి దీనిపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం జరిగిన సదస్సులో రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో డీటీ శశికుమార్, సర్వేయర్ శ్రీనివాసరావు, వీఆర్‌వో వెంకటేశ్వరరావు, రైతులు చిన్నా, రాంబాబు, రాధాకృష్ణ, ఆంజనేయులు, నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

- **భూ రీసర్వేపై అవగాహన ర్యాలీ**

ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): భూ రీసర్వే ద్వారా శాశ్వత పరిష్కారం పొందవచ్చునని తహసీల్దార్ శ్రీవిద్య తెలిపారు. మండలంలోని ఉత్తర చిరువోలులంక రెవెన్యూ పరిధిలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. కోసూరువారిపాలెం గ్రామ సర్పంచ్ కోసూరు అనూష, మండల ఉపాధ్యక్షురాలు నడకుదుటి జననీకుమారీ, మాజీ సర్పంచ్ నడకుదుటి జనార్దనరావు, డీటీ వాణీ, మండల సర్వేయర్ రామకృష్ణబాబు, ఇన్‌ఛార్జీ ఆర్ఐ మోపిదేవి శ్రీనివాసరావు, వీఆర్‌ఓలు, సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్టీల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి

జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి ఫణిధూర్జటి



పౌష్టికాహార కిట్లను అందజేస్తున్న జిల్లా గిరిజన సంక్షేమాధికారి ఫణిధూర్జటి తదితరులు

మచిలీపట్నంటౌన్: జిల్లాలో షెడ్యూల్డ్ తరగతుల వారు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి ముదిగొండ ఫణిధూర్జటి తెలిపారు. నగరంలోని 22వ డివిజన్ దేవునితోట యానాదుల కాలనీ వాసులకు నవజీవన్ బాలభవన్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం పౌష్టికాహార కిట్లను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యానాదులకు అందరికీ జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ప్రత్యేక చొరవ చూపి ఆధార్ కార్డులు ఇచ్చారని, చిన్న చిన్న కారణాలతో ఇంకా కార్డులు అందని వారికి కూడా త్వరలోనే అందజేస్తారన్నారు. యానాదులు వారి పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపి విద్యాబుద్ధులు నేర్పించాలన్నారు. కార్యక్రమంలో నవజీవన్ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ వసంతకుమారి, డివిజన్ పెద్దలు పాల్గొన్నారు.

రూ.4.33 కోట్లతో 241 గోకులం షెడ్లు

కోడూరు: రైతులకు ఉపయోగపడేలా అవనిగడ్డ నియోజకవర్గంలో రూ.4.33 కోట్ల నిధులతో 241 గోశాల గోకులం షెడ్లను నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. పల్లెపండుగ వారోత్సవాల్లో భాగంగా ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో ఉల్లిపాలెం పంచాయతీ పరిధిలోని హరిపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన గోకులం షెడ్లను శుక్రవారం బుద్ధప్రసాద్ ప్రారంభించారు. నియోజకవర్గంలో ఇప్పటికి 70 షెడ్ల నిర్మాణం పూర్తయిందని, ఈ షెడ్లకు సంబంధించి రూ.1.26 కోట్ల నిధులను రైతులకు జమ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్, పీసీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ సుధాప్రవీణ్, ఏపీఓ రవికుమార్, కార్యదర్శి లీలాప్రియాంక పాల్గొన్నారు.



హరిపురంలో గోకులం షెడ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

మినీగోకులాలు పాడి రైతులకు ఎంతో ఉపయోగం

కృత్తివెన్ను: గ్రామీణ ప్రాంతాల్లో పాడి రైతులకు ప్రభుత్వం అందిస్తున్న మినీ గోకులాలు ఎంతో ఉపయోగకరమని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. మండలంలోని సీతనపల్లి పంచాయతీలో నిర్మాణం పూర్తిచేసుకున్న మినీగోకులాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గ్రామంలో అర్హులైన రైతులకు మినీగోకులాలు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు రత్తయ్య, కె.శ్రీనివాసరావు, తులసీరావు, నాగమల్లేశ్వరరావు, ఏపీవో సైదారావు, ఈసీ నాగసురేష్, టీఏలు శ్రీనివాస్, కళ్యాణ్ పాల్గొన్నారు.



సీతనపల్లి పంచాయతీలో మినీగోకులాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

నేడు వడ్డే ఓబన్న జయంతి

చిలకలపూడి(మచిలీపట్నం): బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం వడ్డే ఓబన్న జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమం, సాధికారత అధికారి జి.రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ ప్రాంగణంలోని బీసీ సంక్షేమశాఖ కార్యాలయంలో జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ డీకే బాలాజీ, వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారులు వడ్డెర కులానికి చెందిన సంఘ నాయకులు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొని వడ్డెర ఓబన్నకు నివాళులర్పిస్తారని పేర్కొన్నారు.

బందరుకు పూర్వ వైభవం

- అభివృద్ధిలో దూసుకుపోతున్న వైనం
- శరవేగంగా పోర్టు, మెడికల్ కళాశాల, ఫిషింగ్ హార్బర్ పనులు
- రెండు జాతీయ రహదారుల అభివృద్ధితో ప్రయాణం సుఖమయం
- వినియోగంలోకి నూతన రైల్వే స్టేషన్

మచిలీపట్నంటౌన్: జిల్లా కేంద్రమైన మచిలీపట్నం పూర్వ వైభవం సంతరించుకుంటోంది. నాటి బ్రిటీష్ పాలనలో వర్తక, వాణిజ్య, రవాణా రంగాల్లో ఎంతో అభివృద్ధిని సాధించిన బందరు తర్వాతి కాలంలో ప్రాభవాన్ని కోల్పోయింది. అయితే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకున్న పలు నిర్ణయాలతో పూర్వవైభవం దిశగా అడుగులు వేస్తోంది. విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి నాలుగు లైన్‌లుగా అభివృద్ధి చెందటంతో పాటు కత్తిపూడి- ఒంగోలు జాతీయ రహదారి పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందటంతో ప్రయాణికులు తక్కువ సమయంలో గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. మరో పక్క గుడివాడ- మచిలీపట్నం రైల్వేలైన్ డబుల్‌లైన్‌గా అభివృద్ధితో పాటు నూతన రైల్వే స్టేషన్ అందుబాటులోకి వచ్చింది.

శరవేగంగా పోర్టు, వైద్య కళాశాల, ఫిషింగ్‌హార్బర్ పనులు

మచిలీపట్నం ప్రాంత వాసుల చిరకాల వాంఛ అయిన పోర్టు నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ ప్రాంతంపై ప్రత్యేక చొరవ చూపి దాదాపు రూ.3,900 కోట్లతో ఈ పోర్టు పనులను చేపట్టారు. నార్త్, సౌత్ బ్రేక్ వాటర్ వాల్స్ పనులు చివరిదశకు చేరగా సరుకు ఎగుమతి, దిగుమతులకు వినియోగించే ప్లాట్‌ఫాం, ఇతర నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ప్రభుత్వ వైద్య కళాశాలలో పలు విభాగాల భవనాల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గత రెండేళ్లుగా కళాశాలలో బోధన ప్రారంభమైంది. దాదాపు రూ.550 కోట్లతో ఫిషింగ్ హార్బర్ పనులు చివరిదశకు చేరుకున్నాయి. జిల్లా ప్రభుత్వాసుపత్రి ప్రస్తుతం మెడికల్ కళాశాల అనుబంధ జిల్లా సర్వజన ఆస్పత్రిగా రూపాంతరం చెంది మెరుగైన వైద్య సేవలను అందిస్తోంది. పోచేపల్లిలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఏర్పాటుచేసిన జ్యూయలరీ పార్కుతో రోల్డ్‌గోల్డ్ పరిశ్రమ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరుపొందింది.

నగరం సర్వతోముఖాభివృద్ధి దిశగా...

నగరం వర్తక, వాణిజ్య, విద్య, వైద్య, ఆధ్యాత్మిక, పర్యాటక రంగాల్లో దూసుకుపోతోంది. ఇటీవల కాలంలో నగరంలో పలు పేరున్న కంపెనీల వస్త్ర, గృహోపకరణాల, సరుకులు, మాల్ వంటి వాణిజ్య దుకాణాలు ఏర్పాటయ్యాయి. రెస్టారెంట్‌లు, బిర్యానీ, కర్రీ పాయింట్‌లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లు పెద్ద ఎత్తున ఏర్పాటయ్యాయి. చిలకలపూడి పాండురంగస్వామి ఆలయంతో పాటు పలు శైవ, వైష్ణవ ప్రసిద్ధ దేవాలయాలతో నగరం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. మంగినపూడి బీచ్ ప్రముఖ పర్యాటక కేంద్రంగా అలరిస్తోంది. అత్యంత ప్రాచుర్యం పొందిన బందరు తొక్కుడు లడ్డూ తయారీ, విక్రయంలో సిర్విశెట్టి తాతారావు స్వీట్స్ గత 75 ఏళ్లుగా ప్రత్యేకతను పొందింది. ఈ ప్రాంతంలో విద్యావ్యాప్తి కోసం తాతారావు స్వీట్స్ అధినేత తాతారావు పదేళ్ల కిందట ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాలను ప్రారంభించారు. నాణ్యమైన కేక్‌లు, బిస్కెట్లకు కేరాఫ్ కేకే బేకరీ. ద్విచక్ర వాహన విక్రయాల్లో నగరంలోని నాగసాయి హోండా షోరూం ప్రత్యేకతను సంతరించుకుంది.



మచిలీపట్నంలో నిర్మాణంలో ఉన్న పోర్టు



మచిలీపట్నం రైల్వేస్టేషన్ ముఖద్వారం



మచిలీపట్నం - విజయవాడ హైవేపై కత్తిపూడి - ఒంగోలు జాతీయ రహదారిని కలిపే ఫ్లై ఓవర్



మచిలీపట్నం కోనేరుసెంటర్



మచిలీపట్నంలోని ప్రభుత్వ వైద్య కళాశాల భవనం

గుండెకు అత్యవసర సేవలు



గుండె వ్యాధితో బాధపడే వారికి మచిలీపట్నంలోనే అత్యవసర వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతోనే నగరంలో వైద్యశాలను ప్రారంభించాను. గోల్డెన్ హవర్‌లో వైద్యంతో పాటు మూసుకున్న రక్త నాళాలకు స్టంట్ వేసి రోగి ప్రాణాలు కాపాడుతున్నాం. విజయవాడతో పోలిస్తే తక్కువ ఖర్చుతోనే తమ వైద్యశాలలో వైద్య సేవలందిస్తున్నాం.

– డాక్టర్ తోట ప్రేమ్‌కుమార్,
ప్రేమ్ హార్ట్ అండ్ చైల్డ్ ఆస్పత్రి, మచిలీపట్నం



మచిలీపట్నం ప్రాంతంలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా పేరొందిన పాండురంగ స్వామి ఆలయం